సాక్షి మహబూబ్‌నగర్

సోమవారం । 20 । జనవరి । 2025



పతకాల పంట
సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు అత్యధిక పతకాలు సాధించారు.

వివరాలు 10లో ▸



తిరుగు ప్రయాణం
జాతీయ రహదారి-44 పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఆదివారం వాహనాలు బారులుదీరాయి.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
33.0 /12.7

వాతావరణం
ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. ఉదయం, రాత్రి సమయంలో చల్లని గాలులు వీస్తాయి. చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

క్యూఆర్ కోడ్ ద్వారా అభిప్రాయాలు చెప్పండి

మహబూబ్‌నగర్ క్రైం: పోలీస్ సేవలపై ప్రజలు తమ అభిప్రాయాలు తెలియజేసేందుకు ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ స్కాన్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ జానకి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు అందుతున్న పోలీస్ సేవలపై అభిప్రాయాలు చెప్పడానికి క్యూఆర్ కోడ్ స్టిక్కర్స్ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లతోపాటు డీఎస్పీ, ఎస్పీ కార్యాలయాల్లో అతికించామన్నారు. స్టేషన్‌కు వెళ్లిన ఫిర్యాదిదారులకు పోలీస్ నుంచి అందుతున్న ఐదు అంశాలు ఫిర్యాదులు, ఎఫ్ఐఆర్, ఈ–చలాన్, ట్రాఫిక్ ఉల్లంఘనలు, పాస్‌పోర్ట్ ధ్రువీకరణ అంశాల్లో తమ అభిప్రాయాలు వెల్లడించాలని కోరారు.

యోగి వేమన జయంతిని అధికారికంగా జరపాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రస్థాయిలో విశ్వకవి యోగి వేమన జయంతిని ప్రభుత్వం అధికారికంగా జరిపించాలని ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ సామల పాపిరెడ్డి అన్నారు. పాలమూరు రెడ్డి సేవా సమితి ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం విశ్వకవి యోగి వేమన జయంతిని స్థానిక రాజా బహదూర్‌రెడ్డి కన్వెన్షన్ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాపిరెడ్డి మాట్లాడుతూ రెడ్డి సామాజిక వర్గానికే కాకుండా యోగి వేమన అన్ని కులాల అభిమాన కవి, మార్గదర్శకుడు, సామాజికవేత్త అన్నారు. వేమన రాసిన పద్యాలను సమీకరించి ఒక కావ్యంగా తయారు చేయాలని కవులను కోరారు. రాష్ట్రస్థాయిలో రెడ్ల సమైక్యత, సంఘటీకరణ కోసం సేవాభావంతో స్వచ్ఛందంగా సేవలందించే ఒక రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటు కావాలన్న ధృడసంకల్పంతో తాము కృషి చేస్తున్నామన్నారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత మాట్లాడుతూ యోగి వేమన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించేలా సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం రెడ్డిసేవా సమితి క్యాలండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెడ్డి సేవా సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, కార్యదర్శి రాజేందర్‌రెడ్డి, కోశాధికారి నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షులు వెంకట్రామరెడ్డి, అనంతరెడ్డి, సురేందర్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, రాఘవరెడ్డి, యాదిరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జైపాల్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, వెంకట్‌రెడ్డి, లింగారెడ్డి, దశరథరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు సరస్వతి, స్వరూప, శోభ, అనిత, హేమలత తదితరులు పాల్గొన్నారు.



మళ్లీ గుప్పుమంటోంది!

తండాలు, పల్లెల్లో జోరుగా సారా తయారీ, విక్రయాలు

- గుడుంబాపై ఉక్కుపాదం మోపాలని ఆదేశాలు
- ఉమ్మడి జిల్లాలోని నాటుసారా స్థావరాలపై ప్రత్యేక దృష్టి
- 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు స్పెషల్ డ్రైవ్
- ముడి పదార్థాల రవాణాపై పటిష్ట నిఘా



మహబూబ్‌నగర్ క్రైం: సారా తయారీ, విక్రయాలపై మరోసారి ఆబ్కారీ శాఖ ఉక్కుపాదం మోపనుంది. వంద శాతం సారా రహిత జిల్లాగా మార్పు చేయాలనే ఉద్దేశంతో ఆబ్కారీశాఖ కఠినమైన విధివిధానాలు రూపొందించింది. ఇటీవల రాష్ట్రస్థాయిలో ఎక్సైజ్ ఉన్నతాధికారులు హైదరాబాద్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సారా తయారీ అధికంగా ఉన్న ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓ స్టేషన్ వారీగా జాబితా సిద్ధం చేశారు. ఇందులో ఏ కేటగిరి నుంచి డీ వరకు వేర్వేరుగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయడం జరిగింది. ఈ క్రమంలో 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు దాదాపు నెలరోజులపాటు స్పెషల్ డ్రైవ్ తనిఖీలు చేపట్టడానికి సిద్ధమయ్యారు. ఈ మేరకు ఆబ్కారీ శాఖ అధికారులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో సంబంధిత శాఖ అధికారులు సారా నియంత్రణపై ఒక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. ప్రధానంగా గిరిజన తండాలు, గ్రామాల్లో నాటుసారా తయారీ, విక్రయాలు, తయారీకి ఉపయోగించే బెల్లం, ఇతర ముడి పదార్థాల దిగుమతిపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ కేసులో బైండోవర్ నమోదయ్యాక కూడా సారా అమ్ముతూ పట్టుబడితే వారి నుంచి రూ.2 లక్షల జరిమానా లేకపోతే జైలుశిక్ష విధించాలి.

గతేడాది ఉమ్మడి జిల్లాలో నమోదైన సారా కేసుల వివరాలు

నాగర్‌కర్నూల్ 46	కొల్లాపూర్ 244	అచ్చంపేట 238	తెలకపల్లి 216
కల్వకుర్తి 310	వనపర్తి 288	ఆత్మకూర్ 119	కొత్తకోట 196
మహబూబ్‌నగర్ 191	జడ్చర్ల 98	కోస్గి 116	నారాయణపేట 135
గద్వాల 35	అలంపూర్ 11		

అత్యధికంగా నాగర్‌కర్నూల్‌లో..

ఉమ్మడి జిల్లాలో గతేడాది 2024లో నాగర్‌కర్నూల్ జిల్లాలో అత్యధికంగా 1,054 కేసులు నమోదు కాగా.. ఇందులో 760 మందిని అరెస్టు చేశారు. వనపర్తి జిల్లాలో 603 కేసులు, మహబూబ్‌నగర్, పేట జిల్లాల్లో 540 కేసులు, గద్వాల జిల్లాలో 46 కేసులు నమోదు చేయడం జరిగింది. ఈ క్రమంలో ఉమ్మడి పాలమూరులో నాగర్‌కర్నూల్ జిల్లా సారా తయారీ, విక్రయాల్లో మొదటి స్థానంలో ఉండటంతో 'ఏ' కేటగిరి కింద చేర్చారు. ఇక్కడ ప్రధానంగా తెలకపల్లి, కొల్లాపూర్, కల్వకుర్తి, అచ్చంపేట ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం పరిధిలో ఎక్కువగా సారా తయారీ ఉండటం వల్ల ప్రత్యేక దృష్టిపెట్టారు. ఈ నాలుగు ఎస్‌హెచ్‌ఓల పరిధిలో నెల రోజుల పాటు విధులు నిర్వహించడానికి నాలుగు డీటీఎఫ్ బృందాలు ఏర్పాటు చేయగా ఒక్కో టీంలో ఒక సీఐతో పాటు ఒక ఎస్ఐ, ఐదుగురు సిబ్బంది ఉంటారు. వీరితోపాటు అదనంగా మరో నలుగురు ప్రత్యేక ఎస్ఐలను కేటాయించారు. అలాగే స్థానిక ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది సైతం 24 గంటలపాటు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఇక బీ కేటగిరి కింద మహబూబ్‌నగర్ సర్కిల్, వనపర్తి సర్కిల్, కొత్తకోట సర్కిల్ పరిధిలో ఉన్న గ్రామాలు, తండాలను చేర్చారు. అలాగే నారాయణపేట, గద్వాల జిల్లాలను డీ కేటగిరి కింద ఏర్పాటు చేశారు.



కోయిలకొండ మండలం అచ్యుతాపూర్ తండాలో సారా ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు (ఫైల్)

దాడులు కొనసాగిస్తాం..

2023లో నమోదైన సారా కేసులను ఆధారంగా చేసుకుని ఏ, బీ కేటగిరిలుగా విభజించారు. ఉమ్మడి జిల్లాలో నాగర్‌కర్నూల్ ఐదు స్టేషన్ల పరిధిలో అధికంగా కేసులు నమోదవుతున్నాయి. వాటిని తగ్గించడానికి నాలుగు డీటీఎఫ్ బృందాలు, నలుగురు ఎస్ఐలతోపాటు స్థానిక సిబ్బందిని బృందాలుగా ఏర్పాటు చేశాం. నిత్యం తనిఖీలు కొనసాగుతాయి. కల్వకుర్తి పరిధిలోని తండాల్లో కొంత ఎక్కువగా సారా కాస్తున్నారు. ఈ నాలుగు స్టేషన్ల పరిధిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు అధికంగా చేస్తాం. ఈ నెల 16న నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఆదేశాలు ఇచ్చాం. మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో కూడా సారా తయారీపై నిఘా కొనసాగుతుంది.

– విజయ్‌భాస్కర్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఎక్సైజ్ శాఖ

ప్రజల్లో చైతన్య కార్యక్రమాలు

ఆబ్కారీ శాఖ అధికారులు సారా నియంత్రించడానికి గ్రామాలు, తండాల్లో నివసించే ప్రజల్లో చైతన్యం తేవడానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. గతంలో ఎక్సైజ్ అధికారులు కేవలం సారాను అదుపు చేయడానికి వాటిని అమ్మే వారిని అదుపులోకి తీసుకునే వారు. కానీ, ఇప్పుడు అలా కాకుండా గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. దీంతోపాటు గ్రామాలు, పట్టణాల్లో రోడ్ల వెంట ఉండే గోడలపై, ప్రభుత్వ కార్యాలయాల గోడలపై 'కల్తీ కల్లు, సారా తరిమివేద్దాం.. బంగారు తెలంగాణ నిర్మిద్దాం' అనే స్లోగన్స్ రాయిస్తున్నారు.

కేసుల పరంపర..

ఉమ్మడి జిల్లాలో 2015 డిసెంబర్‌లో సారా రహిత జిల్లాగా ప్రకటించారు. అప్పటికే 95 శాతం సారా నియంత్రణలో ఉందని అధికారులు పేర్కొంటున్నారు. అయితే మారుమూల ప్రాంతాల్లో సారా భూతం మళ్లీ జడలు విప్పుతుంది. కొన్నిచోట్ల అక్రమ రవాణా పెరిగింది. గతేడాది మూడు నెలల్లో సారా కేసుల పరంపర ఒక్కసారిగా పెరిగింది. నెలరోజులుగా నల్లబెల్లం విక్రయాలు జోరందుకున్నాయి. అక్రమ రవాణా పెరిగింది. ఈ నెలరోజులపాటు నిర్వహించే స్పెషల్ డ్రైవ్‌లో సారా పూర్తిగా కంట్రోల్ చేయాలనే లక్ష్యంతో ఎక్సైజ్ శాఖ కసరత్తు చేస్తోంది.

అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందజేస్తామని కలెక్టర్ విజయేందిర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరంతరం ప్రక్రియ అని, చివరి లబ్ధిదారుల వరకు అందిస్తామన్నారు. ఇందులో ఎవరూ ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామసభలలో వచ్చిన దరఖాస్తులను స్వీకరించడంతోపాటు ప్రజాపాలనలో వచ్చిన దరఖా స్తులను కూడా పరిశీలించాలని చెప్పారు. రాష్ట్ర ప్ర భుత్వం ఈ నెల 26 నుంచి ప్రతిష్టాత్మకంగా 4 సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టబోతుందని, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామసభలో దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ప్రజాపాలన కేంద్రాల ద్వారా కూడా కొత్త రేషన్ కార్డులకు లేదా కొత్త సభ్యుల చేర్పుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రజాపాలన సదస్సులో స్వీకరించిన దరఖాస్తుల జాబితాలో అర్హులైన వారిని గుర్తించే ప్రక్రియ పురోగతిలో ఉందన్నారు. ఈ నెల 26 ప్రారంభించే నాలుగు పథకాలపై మంగళవారం నుంచి ప్రారంభమయ్యే గ్రామసభల్లో ప్రజాభిప్రాయలు తీసుకోవడంతోపాటు గ్రామసభలు, ప్రజా పాలనలో కొత్తగా తీసుకున్న దరఖాస్తులు, ఎంపీడీఓ కార్యాలయంలో ఇప్పటికే ఉన్న దరఖాస్తులను తగు రీతిలో పరిశీలించిన తర్వాతే అర్హుల తుది జాబితా ప్రకటిస్తామని స్పష్టం చేశారు.
⇨ వ్యవసాయ యోగ్యమైన ప్రతి భూమికి రైతు భరోసా కల్పించడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. ఉపాధి హామీలో కనీసం 20 రోజుల పాటు కూలి పనికి వెళ్లిన వారికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింపజేస్తామన్నారు. ప్రతి కుటుంబంలో మహిళల బ్యాంకు ఖాతాకే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మొత్తాన్ని బదిలీ చేస్తామన్నారు. ఇటీవల మున్సిపాలిటీలో కలిసిన గ్రామాల్లో 2023– 24లో జరిగిన ఉపాధి హామీ పనుల జాబితాను పరిగణనలో తీసుకుంటామని చెప్పారు. గ్రామసభలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన జిల్లా మాస్టర్ అథ్లెట్లు

33 పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ మైదానంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభచాటారు. ఈ పోటీల్లో క్రీడాకారులు 33 పతకాలు సాధించి సత్తాచాటారు. 11 బంగారు, 13 రజతం, 9 కాంస్య పతకాలు గెలుపొందారు. క్రీడాకారులను మహబూబ్‌నగర్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌గౌడ్, పరశురాములు అభినందించారు.

పతకాల వివరాలు

జగదీశ్వర్ 40+ఏళ్ల విభాగంలో 100 మీ.,లో కాంస్యం, రాములు 45+ ట్రిపుల్ జంప్‌లో కాంస్యం, స్వాములు 45+ ఏళ్ల విభాగం డిస్కస్‌త్రోలో రజతం, షాట్‌పుట్, జావెలిన్‌త్రోలో బంగారు పతకం సాధించారు. దేవదానం 75+ ఏళ్ల విభాగం 5 కేఎం వాక్ రజతం, షాట్‌పుట్‌లో బంగారు, 100 మీటర్ల పరుగులో రజతం, గౌరీశంకర్ 55+లో 5 కేఎం వాక్ రజతం, సీతమ్మ 40+ఏళ్ల విభాగంలో జావెలిన్ త్రోలో బంగారు, షాట్‌పుట్‌లో, డిస్కస్‌త్రోలో రజతం, విక్టర్‌పాల్ 60+లో హైజంప్, డిస్కస్‌త్రోలో బంగారు, వనజారెడ్డి 45+ 800 మీటర్ల పరుగులో, ట్రిపుల్, లాంగ్‌జంప్‌లో బంగారు పతకం గెలుపొందారు. ఖాజామొయినుద్దీన్ 50+ ఏళ్ల విభాగంలో షాట్‌పుట్‌లో రజతం లాంగ్‌జంప్, 100మీటర్ల పరుగులో కాంస్యం, సత్యం 45+ఏళ్ల విభాగం డిస్కస్ త్రోలో బంగారు, షాట్‌పుట్‌లో రజతం, జ్యోతి 35+ ఏళ్ల విభాగంలో జావెలిన్‌త్రోలో బంగారు, షాట్‌పుట్‌లో కాంస్యం, వెంకటయ్య 70+ఏళ్ల విభాగం 5కేఎంవాక్, 200మీటర్ల పరుగులో రజతం పతకం దక్కించుకున్నారు. 100 మీ.,లో కాంస్యం, మన్యమయ్య 45+ఏళ్ల విభాగం 5 కేఎం వాక్‌లో రజతం, 400 మీటర్ల పరుగులో కాంస్యం, ఆంజనేయులు 60+ఏళ్ల విభాగం హ్యామర్‌త్రోలో రజతం, షాట్‌పుట్‌లో కాంస్యం, కృష్ణయ్య 60+ ఏళ్ల విభాగం 200 మీటర్లు, 100 మీటర్ల పరుగులో రజతం, లాంగ్‌జంప్‌లో కాంస్య పతకాలు సాధించారు.

సర్వే చేసినా.. పారితోషికం రాలే

- జిల్లాకు రూ.2.19 కోట్లు మంజూరు
- నెల దాటినా చెల్లించని వైనం
- నిరీక్షిస్తున్న సర్వే సిబ్బంది



ఎన్యూమరేటర్లు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇటీవల చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేయించింది, పారితోషికం ఇవ్వడం మరిచారు. సర్వే చేసిన ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఇంకా పారితోషకం ఇప్పటి దాక అందలేదు. సర్వే ప్రారంభానికి ముందే ప్రభుత్వం జిల్లాకు రూ.2,19,14,000 నిధులు మంజూరు చేసింది. సర్వే ప్రక్రియ ముగిసి నెల గడిచినా నేటికీ పారితోషకాలు చెల్లించ కపోవడంతో వారికి నిరీక్షణ తప్పడం లేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కుల సమగ్ర ఇంటింటి సర్వేకు శ్రీకారం చుట్టింది. మున్సిపాలిటీల్లో వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, మెప్మా రీసోర్స్ పర్సన్లు, సీవోలను ఎన్యూమరేటర్లుగా నియమించారు. గ్రామాల్లో పంచాయతీ సెక్రటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్ అధ్యాపకులు, ఎంఆర్సీ సిబ్బందిని ఎన్యూమరేటర్లుగా నియమించారు. వీరంతా నవంబర్ నెల 9నుంచి 24వ తేదీ వరకు తమకు కేటాయించిన సంఖ్యకు అనుగుణంగా ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. ఆయా కుటుంబాల సమాచారాన్ని ప్రత్యేక ఫాంలో నమోదు చేశారు. ఈ సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు మండల స్థాయి అధికారులను సూపర్‌వైజర్లుగా నియమించారు. ఎన్యూమరేటర్లు చేసిన సర్వే ఫాంలను పరిశీలించి రోజు వారీగా జరిగిన సర్వే వివరాలను సూపర్‌వైజర్లు ఉన్నతాధికారులకు నివేదించారు. సర్వే వివరాలను వెబ్‌సైట్లో నమోదు చేసేందుకు డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించారు.

పెండింగ్‌లో పారితోషికం..

సర్వే నిర్వహించిన ఎన్యూమరేటర్‌కు రూ.10 వేలు, సూపర్‌వైజరుకు రూ.12వేల చొప్పున, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఒక్కో ఫారం నమోదుకు రూ.25 చొప్పున చెల్లించాలని నిర్ణయించింది. ఈ సర్వే ప్రారంభానికి మందే ప్రభుత్వం జిల్లాకు రూ.2,19,14 మంజూరు చేసింది. సర్వే ఫాంల ముద్రణ నుంచి పారితోషికాల చెల్లింపు వరకు ఈ నిధులు వినియోగించాలని సూచించింది. అయితే సర్వేతో పాటు డాటా ఎంట్రీ ప్రక్రియ ముగిసి నెల దాటినా జిల్లాలో వాటి చెల్లింపులు జరగలేదు. దీంతో తమకు పారితోషికాలు ఎప్పుడు అందుతాయా.. అని ఎన్యూమరేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. వాటిని త్వరగా చెల్లించేలా చూడాలని ఉన్నతాధికారులను వారు కోరుతున్నారు.

బిల్లులు చేయడం జరిగింది..

సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించి ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు ఇవ్వాల్సిన పారితోషికం బిల్లులను పూర్తి చేయడం జరిగింది. మరో మూడు, నాలుగు రోజుల్లో ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్ల పారితోషికాలతో పాటు డాటా ఎంట్రీ ఆపరేటర్ల పారితోషికం బిల్లులు ఇవ్వడం జరుగుతుంది. ఎవరూ ఎలాంటి భయం పెట్టుకోవద్దు.

– రవీందర్, సీపీఓ

ముందస్తు ప్రణాళికలు

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

- కృష్ణానదిలో భారీగా తగ్గుతున్న నీటిమట్టం
- నెలరోజుల్లోనే 15 అడుగుల మేరకు తగ్గిన వైనం
- 800 అడుగుల వరకు మాత్రమే 'మిషన్ భగీరథ'కు ఎత్తిపోసే వెసులుబాటు
- ఏప్రిల్ నుంచి జూలై వరకు తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు



ఎల్లూరు సమీపంలోని మిషన్ భగీరథ పంప్‌హౌజ్

కొల్లాపూర్: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యలపై మిషన్ భగీరథ అధికారులు దృష్టి సారించారు. కొన్నేళ్లుగా తాగునీటికి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపడుతూ వస్తున్నారు. ఈసారి కూడా ప్రజలకు తాగునీటి ఇక్కట్లు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. కృష్ణానదిలో భారీగా నీటిమట్టం తగ్గుతున్న నేపథ్యంలో అవసరమయ్యే తాగునీటి వనరులపై పక్కా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

కేఎల్ఐ నుంచి 84 మండలాలకు..

కొల్లాపూర్ మండలం ఎల్లూరు సమీపంలోని కేఎల్ఐ ప్రాజెక్టుకు అనుసంధానంగా మిషన్ భగీరథ పథకాన్ని ఏర్పాటుచేశారు. ఎల్లూరులో మిషన్ భగీరథ పంప్‌హౌజ్ నిర్మించారు. ఇక్కడి నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు రంగారెడ్డి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో మొత్తం 84 మండలాల ప్రజలకు తాగునీరు అందించేందుకు రూ. 5,478 కోట్ల వ్యయంతో పంప్‌హౌజ్‌లు, పైప్‌లైన్లు, వాటర్‌ట్యాంకులు ఏర్పాటుచేశారు. ఎల్లూరు పంప్‌హౌజ్‌లో రూ. 120 కోట్ల వ్యయంతో ఫిల్టర్‌బెడ్స్ నిర్మించారు. ఇక్కడి నుంచే అన్ని నియోజకవర్గాలకు రక్షిత మంచినీరు సరఫరా అవుతోంది.

'పాలమూరు'తోనే శాశ్వత పరిష్కారం..

మిషన్ భగీరథ పథకానికి నీటిని అందించే ఎల్లూరు రిజర్వాయర్‌లో నీటినిల్వ సామర్థ్యం కేవలం 0.36 టీఎంసీ మాత్రమే. మిషన్ భగీరథ ద్వారా రోజూ 0.02 టీఎంసీని తాగునీటి అవసరాల కోసం సరఫరా చేస్తున్నారు. ఎల్లూరు రిజర్వాయర్‌లో అధికంగా నీటినిల్వ చేసుకునే అవకాశం లేదు. గత ప్రభుత్వం పాలమూరు ఎత్తిపోతల పరిధిలోకి మిషన్ భగీరథను చేర్చింది. తాగునీటి అవసరాలకు 6 టీఎంసీల నీటిని నిల్వ ఉంచుకునేలా ప్రణాళికలు రూపొందించింది. అందులో భాగంగా 2023 డిసెంబర్‌లో నార్లాపూర్ రిజర్వాయర్‌లోని 2 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. 2024లోనూ మరో రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోయాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు ఎత్తిపోతలు జరగలేదు. పాలమూరు ఎత్తిపోతల పథకం వినియోగంలోకి వస్తే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

కేఆర్ఎంబీ నిర్ణయం మేరకు..

కృష్ణా బ్యాక్‌వాటర్ లెవెల్స్ తగ్గుదల గురించి మిషన్ భగీరథ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చారు. తాగునీటి అవసరాలకు ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యలను తెలియజేశారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం కూడా కృష్ణా రీవర్‌బోర్డు మేనేజ్‌మెంట్ (కేఆర్ఎంబీ) దృష్టికి తీసుకువెళ్లింది. తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు ఇప్పటివరకు వినియోగించిన నీటి వనరులు, శ్రీశైలం డ్యాంలో నీటినిల్వ, భవిష్యత్ అవసరాలు వంటి అంశాలపై కేఆర్ఎంబీ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. తాగునీటి అవసరాలను పరిగణనలోకి తీసుకొని ఏపీలో విరివిగా సాగుతున్న నీటి ఎత్తిపోతలను కేఆర్ఎంబీ కట్టడి చేస్తేనే వేసవిలో నీటిఎద్దడిని నివారించవచ్చు.

రోజువారీగా పర్యవేక్షిస్తున్నాం..



కృష్ణానదిలో నీటి నిల్వలు క్రమంగా తగ్గుతున్నాయి. నీటి నిల్వకు సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు అందజేస్తున్నాం. ప్రస్తుతానికి మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ఉన్నతాధికారులు చర్చిస్తున్నారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా శ్రీశైలం బ్యాక్‌వాటర్‌ను నిల్వ ఉంచే అవకాశం ఉంది.

– అంజాద్ పాషా, డీఈఈ, మిషన్ భగీరథ



మిషన్ భగీరథ ఫిల్టర్‌బెడ్స్

క్రమంగా తగ్గుతున్న నీటిమట్టం..

గతంలో మార్చి తర్వాత కృష్ణానదిలో నీటిమట్టం తగ్గుముఖం పట్టేది. అయితే కొన్నేళ్లుగా రాష్ట్రంలోని ఎంజీకేఎల్ఐతో పాటు ఏపీలోని పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి, హంద్రీనీవా, మాల్యాల తదితర ప్రాజెక్టుల ద్వారా రోజువారీ నీటి ఎత్తిపోతలు సాగుతుండటం.. సాగర్‌కు నీటి విడుదల, శ్రీశైలంలో జలవిద్యుత్ ఉత్పత్తి వంటి కారణాలతో కృష్ణా బ్యాక్‌వాటర్ లెవెల్స్ త్వరగా తగ్గిపోతున్నాయి. జనవరి ప్రారంభం నుంచే నీటిమట్టం పడిపోతోంది. గత డిసెంబర్‌లో 870 అడుగుల ఎత్తులో ఉన్న బ్యాక్‌వాటర్ లెవెల్.. ఇప్పుడు 850 అడుగుల మేరకు చేరింది. ఇదే విధంగా నీటిమట్టం తగ్గితే ఏప్రిల్ నెలాఖరు నాటికి 800 అడుగులకు నీటిమట్టం పడిపోతుంది. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి అవసరాలకు నీటిని ఎత్తిపోసుకునేందుకు 800 అడుగుల వరకే అనుమతులు ఉన్నాయి. ఏప్రిల్ నెలాఖరులోగా సరిపడా నీటిని నిల్వ చేసుకోకుంటే.. మే, జూన్, జూలై నెలల్లో ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉంటాయి.

చంద్రకల్‌లో 13, 16వ శతాబ్దపు విగ్రహాలు



పెద్దకొత్తపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం చంద్రకల్ గ్రామంలో చారిత్రక శిల్పాలను కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. వెన్నెల అకాడమీ అధ్యక్షుడు బుచ్చర్ల దినకర్ ఇచ్చిన సమాచారం మేరకు ఆదివారం చంద్రకల్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణలో ఉన్న 16వ శతాబ్దం నాటి భక్తాంజనేయస్వామి, 13వ శతాబ్దం నాటి శివలింగాన్ని ఆయన పరిశీలించారు. నల్లసానపు రాతిలో పానవట్టంపై స్వయంభూ శివలింగం నునుపుగా కాకతీయ శిల్ప శైలిలో ఉందని, గ్రానైట్ రాతిలో చెక్కిన నిలువెత్తు భక్తాంజనేయస్వామి విగ్రహం విజయనగర వాస్తు శైలిలో ఉందన్నారు. చారిత్రక ప్రాధాన్యత గల ఈ రెండు కళాఖండాలను ఆలయంలోపల పీఠాలపై నిలబెట్టి వాటి చారిత్రక వివరాలతో ఏర్పాటు చేసి భవిష్యత్ తరాలకు అందించాలని గ్రామస్తులకు సూచించారు.



కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అసంఘటిత రంగ, వ్యవసాయ కార్మికుల హక్కులను కాలరాస్తుందని సీఐటీయూ రాష్ట ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి అన్నారు. సీఐటీయూ, వ్యవసాయ కార్మిక, రైతు సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. దేశంలో రైతులు మద్దతు ధర కోసం దేశ రాజధాని, హరియాణా, పంజాబ్, బీహార్ రైతులు పెద్దఎత్తున పోరాటం చేస్తున్నారన్నారు. రైతు నాయకులు జగ్జీత్‌సింగ్ దవాళే 54 రోజులుగా ఆమరణ దీక్షకు పూనుకున్నారని, ఆయనకు మద్దతుగా 111 మంది రైతులు ఆమరణ దీక్షలకు దిగారన్నారు. అధికారంలో ఉన్న కేంద్ర బీజేపీ ప్రభుత్వం రైతు సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధి చూపడం లేదన్నారు. కార్మికుల హక్కులను కాలరాసేందుకు ఉపాధి హామీ పథకాన్ని సైతం నిర్వీర్యం చేస్తుందన్నారు. కార్మిక, కర్షక, వ్యవసాయ కూలీలు జనవరి 19తో ఐక్యమవుతున్నారన్నారు. ఐక్య పోరాటాల ద్వారానే కార్మికుల హక్కులు సాధ్యమవుతాయని, అందుకు కార్మికుల పక్షాన పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా సీనియర్ నాయకులు కిల్లె గోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, నాయకులు వేణుగోపాల్, సత్యన్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుప్తనిధుల కోసం పూజలు

- ఏడుగురిపై కేసు నమోదు



లింగాల: మండల కేంద్ర శివారులోని ఓ వ్యవసాయ పొలంలో కొంత మంది వ్యక్తులు గుప్త నిధుల కోసం పూజలు చేసిన ఘటన ఆదివారం జరిగింది. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాలు.. లింగాలకు చెందిన కాకం పర్వతాలు తన పొలం సమీపంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపేందుకు సిద్ధమయ్యాడు. తవ్వకాల్లో బల్మూర్, నాగర్‌కర్నూల్, హైదరాబాద్‌కు చెందిన పలువురు పాల్గొన్నారు. తెల్లవారు జామున పూజలు చేసి తవ్వకాలు జరిపేందుకు సిద్ధం కాగా వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆయా ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనంలో రావడం గమనించిన పోలీసులు ఆరా తీయగా సంఘటన వెలుగు చూసిందని పేర్కొన్నారు.

వేరుశనగ @ రూ.6,269

నవాబుపేట: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఆదివారం వేరుశనగ పోటెత్తింది. మార్కెట్‌కు మొత్తం 1,459 బస్తాల వేరుశనగ రాగా క్వింటాల్ గరిష్ఠంగా రూ.6,269, కనిష్ఠంగా రూ.5,769 ధర వచ్చింది. అలాగే 1,168 బస్తాల వరి ధాన్యం రాగా క్వింటాల్ సరాసరిగా రూ.2,684, కంది 602 బస్తాలు రాగా క్వింటాల్ ఒకే ధరగా రూ.7,277 చొప్పున పలికిందని మార్కెట్ కార్యదర్శి రమేష్ తెలిపారు.

పర్యాటకులకు సరికొత్తగా..



అక్టోపస్ వ్యూ పాయింట్ వద్ద పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన కుటీరం

అక్కమహాదేవి-దోమలపెంట టూర్ స్టే ప్యాకేజీ

- అటవీ ప్రాంతంలో 24 గంటలు గడిపే అవకాశం
- పగలంతా జంగిల్ సఫారీ.. రాత్రి బసకు ఏర్పాట్లు
- రేపటి నుంచి అందుబాటులోకి..

అచ్చంపేట: ప్రకృతి రమణీయతకు మారుపేరు నల్లమల అభయారణ్యం. విశేషమైన వృక్ష సంపద, లెక్కలేనన్ని వన్యప్రాణులు, పక్షులు, క్రూరమృగాలు, ఔషధ మొక్కలు ఈ అడవి సొంతం. పులులకు పెట్టని కోటగా పేరొందిన నల్లమలలో జాలీగా జంగిల్ సఫారీ చేస్తూ వన్యప్రాణులను ప్రత్యక్షంగా తిలకించేందుకు అటవీశాఖ మరో అవకాశం కల్పిస్తోంది. ఇప్పటికే మన్ననూర్ జంగిల్ రిసార్ట్, టైగర్ స్టే ప్యాకేజీ (ఫర్హాబాద్ టూరిజం ప్యాకేజీ) అందుబాటులో ఉండగా.. కొత్తగా అక్కమహాదేవి–దోమలపెంట టూర్ స్టే ప్యాకేజీలను అమలు చేస్తోంది. రోజువారీ ఉరుకుల పరుగుల జీవన పోరాటంలో అలసిన మనసులను ఆహ్లాదపరిచేందుకు.. ప్రకృతి ప్రేమికులకు ఆనందాన్ని పంచేందుకు ఈ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకువచ్చారు. వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందించేందుకు నల్లమలలోని అమ్రాబాద్ పులుల అభయారణ్యం (ఏటీఆర్) స్వాగతిస్తోంది.

సఫారీ ఇలా..

ఆహ్లాదకరమైన వాతావరణంలో నెమళ్లు, వివిధ రకాల పక్షులు, మనుబోతులు, కణుతులు, జింకలు, చుక్కల జింకలు, కొండముచ్చులు, దుప్పులు, అడవి పందులు, కొండ గొర్రెలు, భయపెట్టే కొండ చిలువలు, తాచు పాములు వంటి వాటి మధ్య జంగిల్ సఫారీ కొనసాగుతుంది.

- అక్కడక్కడ వాచ్ టవర్‌లను ఏర్పాటు చేశారు. సందర్శకులు వీటిని ఎక్కితే నల్లమల అంతా చూడవచ్చు.
- ప్రస్తుతం నల్లమలలో దాదాపు 150 చిరుతలు, 34 పెద్ద పులుల ఉన్నట్లు అంచనా. అప్పుడప్పుడు చిరుత, పెద్ద పులులు కూడా జంగిల్ సఫారీలో కనిపిస్తున్నాయి.
- అడవిలోకి వెళ్లే పర్యాటకులు అటవీ సిబ్బంది చెప్పిన చోట మాత్రమే కిందకు దిగాలి.
- జంగిల్ సఫారీకి నల్లమలలో స్థానికంగా నివసించే చెంచులే గైడ్‌లుగా ఉంటారు. పక్షులు, వన్యప్రాణుల విశిష్టతను వివరిస్తారు.

వన నివాసం ఇలా..

మొదటి రోజు పర్యాటకులను సఫారీ వాహనంలో దోమలపెంట పరిసర ప్రాంతంలోని అక్టోపస్ వ్యూ పాయింట్, వజ్రాల మడుగు వాచ్ టవర్ నుంచి నల్లమల అందాలను తిలకించేందుకు తీసుకెళ్తారు.

నేటి నుంచి ప్రారంభం..



ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్న వారిని సోమవారం నుంచి అక్కమహాదేవి – దోమలపెంట టూర్ స్టే ప్యాకేజీకి తీసుకెళ్తాం. పర్యాటకులు మధ్యాహ్నం 2:30 గంటల వరకు దోమలపెంట వనవిహంగ గెస్ట్‌హౌస్‌కు చేరుకోవాలి. చెక్ ఇన్ తర్వాత పర్యాటకులను 3:30 గంటలకు అక్టోపస్ వ్యూ పాయింట్, వజ్రాల మడుగుకు తీసుకెళ్తాం. వసతి లేకుండా నేరుగా సఫారీ, ట్రెక్కింగ్ అవకాశం త్వరలో అందుబాటులోకి తెస్తాం.

– గురుప్రసాద్, ఎఫ్ఆర్ఓ, దోమలపెంట

అక్కడే కొండల్లో, నదీ పరిసరాల్లో విహరించే ఏర్పాట్లు చేశారు. రెండో రోజు సఫారీలో శ్రీశైలం ప్రధాన రహదారిపై ఉన్న అక్కమహాదేవి గేట్ నుంచి 5.5 కి.మీ. దూరంలోని గుహలకు దట్టమైన అటవీ ప్రాంతం నుంచి ట్రెక్కింగ్ పాయింట్‌కు తీసుకెళ్తారు. అక్కడి నుంచి ట్రెక్కింగ్ చేస్తూ అక్కమహాదేవి గుహలకు పర్యాటకులు చేరుకుంటారు. ఈ మార్గమధ్యంలో నల్లమల అందాలు, జంతువుల కదలికలను వీక్షిస్తూ ముందుకు సాగేలా ఏర్పాట్లు చేశారు. సందర్శకులు సహజసిద్ధంగా ఏర్పడిన పెద్ద శిలాతోరణం, అక్కమహాదేవి తపస్సు చేసిన గుహను చేరుకున్నాక.. అక్కడ మహాశివుడిని దర్శించుకోవచ్చు. రెండురోజుల సఫారీ, వ్యూ పాయింట్, ట్రెక్కింగ్, అక్కమహాదేవి గుహల సందర్శనకు మూడు టారిఫ్‌ల్లో వనవిహంగ కాటేజీలతో కలిపి రూ. 6,500, రూ.7,500, రూ. 8,500 ప్యాకేజీలను నిర్ణయించారు. వివరాలకు www.amrabadtigerreserve.com వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. రోడ్డు మార్గాన ఆర్టీసీ బస్సులు లేదా సొంత వాహనాల్లో చేరుకోవాలి. పర్యాటకుల ఆసక్తి మేరకు ఎకో టూరిజం క్యాంపుల్లో విడిది కల్పిస్తారు. అక్కడి నుంచి సఫారీలో నల్లమల అందాలు తిలకించేలా అటవీశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.

అక్కమహాదేవి గుహలకు నాలుగు మార్గాలు..

అక్కమహాదేవి గుహలను సందర్శించేందుకు నాలుగు మార్గాలు ఉన్నాయి. సోమశిల నుంచి తెలంగాణ పర్యాటకశాఖ ఏర్పాటు చేసిన బోటు ద్వారా 40 కి.మీ. దూరం ప్రయాణం చేయాలి. లేదా దోమలపెంట నుంచి ఎకో టూరిజం ఏర్పాటు చేసిన సఫారీ, ట్రెక్కింగ్ ద్వారా దోమలపెంట – హైదరాబాద్ మార్గం నుంచి 16 కి.మీ. వెళ్తే గుహలకు చేరుకోవచ్చు. మరో వైపు పాతాళగంగా నుంచి మరబోటులో 10 కి.మీ. కృష్ణానదిలో ప్రయాణించాలి. పంచమఠాల నుంచి చుక్కలపర్వతం, జాతర రేవు, బుగ్గవాగు మీద 15 కి.మీ. వెళ్తే అక్కమహాదేవి గుహలకు వెళ్లొచ్చు. మొదటి, రెండవ మార్గం మాత్రమే సులువుగా ఉంటుంది.



అక్కమహాదేవి గుహ

భక్తజన సందడి



ఉత్సవ విగ్రహాలకు త్రిశూల స్నానం

- అంగరంగ వైభవంగా ఉమామహేశ్వరం బ్రహ్మోత్సవాలు
- శేషవాహన సేవ, ప్రత్యేక పూజలు
- నిరంజన్‌షావలీ దర్గాలో జారత్ నిర్వహణ



ఉమామహేశ్వరంలో భక్తుల సందడి

అచ్చంపేట: అటు ఉమామహేశ్వర బ్రహ్మోత్సవాలు.. ఇటు రంగాపూర్ నిరంజన్ షావలీ దర్గాతో ఆదివారం రెండు ప్రాంతాల్లో భక్తజన సందడి నెలకొంది. నల్లమల కొండలపై వెలసిన పార్వతీ పరమేశ్వరుల బ్రహ్మోత్సవాల సందర్భంగా జరుగుతున్న వేడుకలను తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పాపనాశిని గుండం వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకొని, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు.

శేషవాహన సేవ..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రదోష కాలంలో జరిగిన శేషవాహన సేవలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. ఆలయం నుంచి పాపనాశిని గుండం వరకు శేషావాహనంలో స్వామి వారి ఊరేగింపు సాగింది. ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఈఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేద పడింతుల మంత్రోచ్ఛరణల మధ్య భజన బృంద వారిచే సంకీర్తనలు పాడారు. భక్తుల జయజయ ధ్వానాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఉదయం ప్రాతఃకాల పూజలు నిర్వహించారు. గవ్యాంత పూజలు, రుద్రభిషేకం, రుద్రహోమం, అవహిత దేవత హోమాలు, మూర్తి హోమం, శేష హోమం, పూర్ణాహుతి, వసంతోత్సవం, శేషవాహనపై పల్లకీసేవ, త్రిశూలస్నానం, ధ్వజావరోహణం, పుష్పోత్సవము, ఏకాంతసేవ, మహాదశీర్వచనం, పండిత సత్కారం కార్యక్రమాలు వేద పండితులు వీరయ్యశాస్త్రి నిర్వహించారు.

జారత్..

ఈ నెల 16 నుంచి ఉమామహేశ్వర బ్రహ్మోత్సవాలు ఆరంభం కాగా, శనివారం నుంచి రంగాపూర్ దర్గాతండాలోని దర్గా ఉర్సు ప్రారంభమైంది. ఉర్సుకు ఉమ్మడి పాలమూరు జిల్లాతో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల భక్తులే గాక ఏపీలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు కూడా అధిక సంఖ్యలో తరలివచ్చారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు, కందూరులు, ఫతేహాలు సమర్పించి మొక్కులు సమర్పించుకున్నారు. ఆదివారం ఉదయం 11గంటలకు నిరంజన్‌షావలీ దర్గా ఆవరణలోని మసీదులో కమిటీ అధ్యక్షుల ఆధ్వర్యంలో జారత్ నిర్వహించారు. ముస్లింల ప్రత్యేక ప్రార్థనల అనంతరం జారత్ గానం చేపట్టారు. ఈ కార్యక్రమం భక్తులను ఎంతో ఆకట్టుకొంది.



నిరంజన్‌షావలీ దర్గాలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత



పోలీస్‌లతో వాగ్వాదం చేస్తున్న యాపదిన్నె గ్రామస్తులు

యాపదిన్నె గ్రామస్తుల నిరసన

అయిజ: స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. యాపదిన్నె గ్రామానికి చెందిన దావీద్(40) శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా ఆదివారం ఆగ్రామస్తులు పోలీస్ స్టేషన్ చేరుకొని నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. దీంతో పోలీసులకు, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. భారత మాల కాంట్రాక్టర్‌తో మృతుడి కుటుంబానికి పరిహారం ఇప్పిస్తామని చెప్పి మాటమారుస్తున్నారని ఆందోళనకారులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్‌స్టేషన్ ముందు నిరసనలు చేపడితే చర్యలు తీసుకుంటామని ఎస్సై విజయభాస్కర్ హెచ్చరించారు. విషయం తెలుసుకున్న శాంతినగర్ సీఐ టాటా బాబు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని యాపదిన్నె గ్రామస్తులతో మాట్లాడారు. టిప్పర్ డ్రైవర్‌పై కేసునమోదు చేశామని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో గ్రామస్తులు కోపోద్రిక్తులు కాగా అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కాంట్రాక్టర్‌కు సంబంధించిన వ్యక్తిని సోమవారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి మృతుడి కుటుంబానికి, గాయపడ్డ వ్యక్తులకు న్యాయం చేస్తామని చెప్పడంతో వారు శాంతించారు. ఈవిషయంపై సీఐ టాటా బాబును వివరణ కోరగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు.

పీయూ వైస్ ప్రిన్సిపాల్‌కు ఉత్తమ అధ్యాపక అవార్డు



కృష్ణయ్యకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న శ్రీ హర్యాణి సకల కళావేదిక సభ్యులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ(పీయూ) వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్యకు జాతీయ ఉత్తమ అధ్యాపక అవార్డును శ్రీహర్యాణి సకల కళావేదిక ఆధ్వర్యంలో అందజేశారు. కరీంనగర్‌లోని ఫిలిం భవన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయనను స్వర్ణ కంకణం, ప్రశంసా పత్రంతో సత్కరించారు. కొన్నేళ్లుగా తెలుగు సాహిత్యంలో ఆయన చేస్తున్న సేవలకు ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్యను పీయూ వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ చెన్నప్ప అభినందించారు.

లక్ష్మీనృసింహుడి శేషవాహనసేవ



సింగోటంలో లక్ష్మీ నృసింహుడి శేషవాహన సేవలో పాల్గొన్న వేదపండితులు, భక్తులు

కొల్లాపూర్ రూరల్: సింగోటం లక్ష్మీ నృసింహ స్వామి శేషవాహన సేవ వైభవంగా సాగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ఆవరణలోని మండపంలో ఉదయం వేద పండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల సమక్షంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను శేషవాహనంపై ఆశీనులను చేశారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీక్షాహవనం, స్వామి వారి మూలమంత్ర హవనం, తీర్థావళి, బలిహరణం, పూర్ణాహుతి, వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం శేషవాహనంపై ఆలయం నుంచి రత్నగిరి కొండ వరకు ఊరేగించారు. సాయంత్రం స్వామి వారికి గర్భగుడిలో చప్పరపుసేవ, పుష్పోత్సవం, బ్రాహ్మణ మహదాశీర్వచనం, వేదస్వస్తి జరిపారు. ఇదిలాఉండగా, బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లా నుంచే కాక ఏపీ రాష్ట్రం నుంచి భక్తులు తరలివచ్చారు. ఉదయాన్నే స్వామివారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఎత్తుకెళ్లాడు.. తెచ్చిపెట్టాడు



అలంపూర్ చౌరస్తాలో బాధితుడికి బైక్‌ను అప్పగిస్తున్న పోలీసులు

బైక్ చోరీలో వింత ఘటన

అలంపూర్: గుర్తుతెలియని ఓ వ్యక్తి ఒక బైక్‌ను చోరీ చేశాడు. మరుసటి రోజు బైక్‌ను అదేస్థలంలో తెచ్చి పెట్టిన వింత ఘటన ఆదివారం అలంపూర్ చౌరస్తాలో చోటుచేసుకుంది. దీంతో దొరికిన బైక్‌ను పోలీసులు బాధితుడికి అప్పగించారు. వివరాలు.. వనపర్తి జిల్లాకు చెందిన మణ్యం అనే గొర్రెల పెంపకందారుడు. శనివారం సాయంత్రం అలంపూర్ చౌరస్తాలోని ఒక చికెన్ దుకాణం వద్దకు వచ్చాడు. చికెన్ తీసుకోవడానికి తన బైక్‌ను అక్కడే ఆపివెళ్లాడు. పక్కనే ఉండటంతో తాళం సైతం దానికే వదిలి వెళ్లాడు. చికెన్ తీసుకొని వచ్చిచూడగా అతడికి బైక్ కనిపించలేదు. చికెన్ దుకాణ యజమానులు శ్రీనివాసులు, వెంకట్రామ్‌లు సైతం బైక్ కోసం వెతికారు. కానీ లాభం లేకపోవడంతో స్థానికంగా ఉన్న ఉండవెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. పోలీసులు సైతం బైక్ కోసం అన్వేషణ మొదలుపెట్టారు. కానీ ఊహించనివిధంగా దొంగలించిన బైక్ ఆదివారం 11గంటల సమయంలో బైక్ అదేస్థానంలో దర్శనమిచ్చింది. తాళం, అందులోని ఉల్లిగడ్డలు సైతం అలాగే ఉన్నాయి. చికెన్ షాప్ యజమాని శ్రీనివాసులు వాహనాన్ని గుర్తించి పోలీసులకు, బైక్ యజమానికి సమాచారమిచ్చాడు. పోలీసులు అక్కడికి చేరుకొని బైక్‌ను బాధితుడికి అప్పగించగా అతడు హర్షం వ్యక్తంచేశాడు. గుర్తుతెలియని వ్యక్తి పొరపాటున బైక్ తీసుకెళ్లి తనది కాదని గ్రహించి తిరిగి అదేస్థానంలో తెచ్చి పెట్టి ఉంటాడని స్థానికులు చర్చించుకుంటున్నారు.

కాల్వలో పడి యువకుడు మృతి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ సమీపంలో శ్రీవారిసముద్రం చెరువు అలుగు కాల్వలో పడి బోయ శ్రీనివాసులు(35) అనే యువకుడు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ హృషికేష్ తెలిపిన వివరాలు.. కర్నూల్ జిల్లా కొత్తపల్లి మండలం ఎదురుపాడు గ్రామానికి చెందిన బోయ శ్రీనివాసులు మాటలు రాని యువకుడు. రెండు రోజుల క్రితం సింగోటం జాతరకు వచ్చాడు. అతడు కనిపించకపోవడంతో కుటుంబీకులు పరిసరాల్లో గాలించారు. అయినా ఆచూకీ లభించలేదు. ఆలయ పక్కలో వున్న అలుగు కాల్వలో పడి ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి బంధువు నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మిరప పంటకు తెగుళ్ల బెడద



తెగుళ్లు సోకిన మొక్క



తెల్లదోమ నివారణకు ఏర్పాటుచేసిన పసుపు రంగు అట్ట

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

అలంపూర్: జిల్లాలోని రైతులు బోరుబావులు, కాల్వల కింద రైతులు మిరప పంట సాగుచేశారు. ప్రస్తుతం పంట పూత, కాయ దశకు చేరింది. రైతులు కష్టపడి పండించిన మిరప పంటకు రసం పీల్చే పురుగులు ఆశిస్తున్నట్లు వ్యవసాయ అధికారులు గుర్తించారు. వీటి ఉధృతి ఎక్కువగా ఉన్నందున రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి ఉన్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా తెల్లదోమ వల్ల తెగుళ్ల ఆశిస్తున్నట్లు వివరిస్తున్నారు.

తెగుళ్ల రకాలు: మిరప పంటను ఆశించే తెగుళ్లు ప్రధానంగా రెండు రకాలుగా ఉంటాయి. ఒకటి జెమిని వైరస్, రెండోది కుకూంబర్ మొజాయిస్ వైరస్. తెగుళ్ల ఉధృతికి తెల్లదోమ ప్రధాన కారణంగా పనిచేస్తోంది.

జెమిని తెగులు సోకితే..

జెమిని తెగులు సోకితే ఆకులు చిన్నవిగా మారి పైకి ముడుచుకొని పడవ ఆకారంలోకి మారుతాయి. ఆకుల మీద బొబ్బలు ఏర్పడి ముడుచుకుంటాయి. మొక్కల ఎదుగుదల లోపించి గిడసబారిపోతాయి. పూత ఉండదు. పసుపుపచ్చగా మారి కనుపుల మధ్య దూరం తగ్గుతుంది.

కుకూంబర్ మొజాయి వైరస్..

కుకూంబర్ మొజాయి వైరస్ సోకితే నల్లని మసి లేదా బూజు ఆకులపై కనిపిస్తుంది. మొక్కలు గిడసబారి ఎదుగుదల లోపిస్తుంది. ఆకులు పచ్చదనం కోల్పోయి ఆకారం మారి కొనలు సాగుతాయి. పూత, కాయ ఉండదు.

సస్యరక్షణ: మిరప పంటను పప్పు జాతి పంటలైన పెసర, అలసందలు, చిక్కుడు మొదలగు వాటితో పంట మార్పిడి చేయాలి. వైరస్ సోకిన మొక్కలను పొలంలో గమనిస్తే ఎప్పటికప్పుడు తీసివేయాలి. తెగులుకు మందు లేదు. దాన్ని వ్యాప్తి చేసే తెల్లదోమ, పేను బంకలను నివారించుకోవాలి. పొలం మధ్యలో పసుపు అట్టలు ఏర్పాటుచేసి, గ్రీసు లేదా ఆముదం నునె పూసి ఉంచినట్లయితే తెల్ల దోమ ఉధృతి గణనీయంగా తగ్గించవచ్చు. అదే విధంగా మిరప పంట చుట్టూ 3 లేదా 4 సాళ్ల జొన్న, మొక్కజొన్నను కంచె పంటలుగా వేసుకుంటే వైరస్‌ను వ్యాప్తి చేసే తెల్లదోమ, పేను బంక పురుగుల వ్యాప్తిని తగ్గించవచ్చు. వేప నూనె 4 మి.లీ. నీటిలో కలిపి 3 నుంచి 4 సార్లు పిచికారీ చేసుకుంటే పేను బంక, తెల్ల దోమ ఉధృతి తగ్గుతుంది.

పేను బంక, తెల్లదోమ నివారణకు..

అసిటామి ప్రిడ్ 0.3 గ్రాములు, ఇమిడా క్లోప్రిడ్ 0.3 గ్రాములు, డైఫెన్ థురాన్ 1.5 గ్రాములు థయామిథాక్సాన్ 0.2 గ్రాములు, ట్రయజోఫాస్ 2.0 మి.లీ. లీటరు నీటిలో కలుపుకొని ఆకుల పై భాగం, కింది భాగం బాగా తడిచేట్లు పిచికారీ చేసుకోవాలి. సాయంత్రం లేదా ఉదయం వేళల్లో మాత్రమే పిచికారీ చేయాలి.



చిత్తారమ్మ జాతరకు వెల్లువెత్తిన భక్తులు

మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ పరిధిలోని గాజుల రామారం శ్రీ చిత్తారమ్మ దేవి ఆలయ జాతర స్వర్ణోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. చిత్తారమ్మా.. మమ్మల్ని దీవించు తల్లీ.. అంటూ భక్తజనం తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్త జనంతో ఆ ప్రాంతమంతా జనసంద్రమైంది. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే వివేకానంద గౌడ్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ తదితరులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని నగరంతో పాటు రాష్ట్ర, రాష్ట్రేతర భక్తులు సుమారు 3 లక్షల మందికి పైగా దర్శించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

– కుత్బుల్లాపూర్

కొమురవెల్లికి పోటెత్తిన భక్తజనం



మహా జాతర ప్రారంభం

కొమురవెల్లి(సిద్దిపేట): రాష్ట్రంలో ప్రముఖ శైవ క్షేత్రమైన సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం బ్రహ్మోత్సవాలు (మహాజాతర) అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏటా సంక్రాంతి పండుగ తర్వాత వచ్చే మొదటి ఆదివారంతో ప్రారంభమయ్యే ఈ జాతర మూడు నెలల పాటు కొనసాగనుంది. వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పరిసరాలన్నీ మల్లన్న నామస్మరణతో మారుమోగాయి. మహిళలు బోనాలతో తరలివచ్చారు. మల్లన్న స్వామికి, గుట్టపై వెలిసిన రేణుక ఎల్లమ్మకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్రం నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో స్వామి వారి దర్శనానికి సుమారు 6 గంటల సమయం పట్టింది. హైదరాబాద్‌కు చెందిన భక్తులు సోమవారం ఆలయ తోటబావి ప్రాంగణంలో నిర్వహించే పెద్దపట్నం, అగ్నిగుండాలకు అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు.

ముగిసిన వైకుంఠ ద్వార దర్శనం

తిరుమల: తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం నిర్ణీత సమయంలో జరుగుతోంది. ఆదివారం అర్ధరాత్రితో వైకుంఠ ద్వార దర్శనం ముగిసింది. శనివారం తిరుమల శ్రీవారిని 75,931 మంది దర్శించుకోగా.. 25,717 మంది తలనీలాలు సమర్పించారు. అదేవిధంగా శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.4 కోట్లు లభించింది. కాగా, ఘాట్‌రోడ్డులో పొగ మంచు దట్టంగా కమ్మేసింది. వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాలని టీటీడీ భద్రతా సిబ్బంది సూచించింది.

శ్రీవారి సన్నిధిలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని ఆదివారం మంత్రి సవిత, సినీ నిర్మాత దిల్ రాజు, దర్శకుడు అనిల్ రావిపూడి, హీరోయిన్‌లు ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి, బాల నటుడు రేవంత్, నటుడు శ్రీనివాస్‌రెడ్డి, నిర్మాత దానయ్య, సినీ నటుడు రాజకుమార్ దర్శించుకున్నారు.

దుర్గమ్మ సేవలో కేంద్రమంత్రి బండి సంజయ్



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడలోని కనకదుర్గమ్మను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆదివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు ఆశీర్వదించగా, ఆలయ ఈఈ కోటేశ్వరరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టువస్త్రాలను అందజేశారు.

ప్రజల భద్రతకు ఎన్‌డీఆర్‌ఎఫ్ భరోసా

కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా



ఎన్డీఆర్ఎఫ్ పరికరాలను పరిశీలిస్తున్న అమిత్‌షా, చంద్రబాబు తదితరులు

సాక్షి, అమరావతి: విపత్తులు సంభవించినప్పుడు ప్రజల భద్రతకు భరోసానిస్తూ జాతీయ విపత్తు స్పందన దళం(ఎన్‌డీఆర్‌ఎఫ్) నిరుపమాన సేవలు అందిస్తోందని కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. గన్నవరం మండలం కొండపావులూరులో ఆదివారం నిర్వహించిన ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌డీఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్, దక్షిణ క్యాంపస్ భవనాలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం మూడింతల అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఆరు నెలల్లోనే రాష్ట్రానికి రూ.3 లక్షల కోట్ల విలువైన సహకారం అందించామని తెలిపారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించడంతోపాటు రాజధాని అమరావతి నిర్మాణానికి హడ్కో ద్వారా రూ.27 వేల కోట్ల సహాయం అందిస్తున్నామని చెప్పారు. 2028 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తవుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ అమిత్ షా మనిషిలా కాకుండా మెషిన్‌లా పని చేస్తున్నారని, ఆయన పనితీరు చూస్తుంటే అసూయ కలుగుతోందన్నారు. పీపీపీ విధానంలో 'గోదావరి – బనకచర్ల' అనుసంధానానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఈ బృహత్తర కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం సహాయం చేయాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ విపత్తులను తక్షణం ఎదుర్కొనేందుకు గ్రామ స్థాయిలోకూడా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, బండి సంజయ్, భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత తదితరులు పాల్గొన్నారు. అనంతరం అమిత్ షా గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని, ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయలుదేరారు.

తొక్కిసలాట ఘటనపై దృష్టి


తిరుపతిలో ఇటీవల చోటు చేసుకున్న తిరుమల శ్రీవారి భక్తుల తొక్కిసలాట ఘటనపై కేంద్ర హోమ్ శాఖ సైతం దృష్టి సారించిందని ఆ శాఖ మంత్రి అమిత్‌షా వీహెచ్‌పీ నేతల భేటీలో వెల్లడించారు. అధికారిక కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్ర పర్యటనకు వచ్చిన ఆయనతో ఆదివారం ఉదయం వీహెచ్‌పీ జాతీయ ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజు నేతృత్వంలో సంఘ ప్రముఖ్‌లు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇటీవల విజయవాడలో వీహెచ్‌పీ నిర్వహించిన హైందవ శంఖారావం సభ గురించి వారు అమిత్‌షాకు వివరించారు. దేశ వ్యాప్తంగా ఆలయాలను ప్రభుత్వ పరిధి నుంచి పూర్తిగా తప్పించి, స్వయం ప్రతిపత్తి కల్పించేందుకు కేంద్రం తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా తిరుపతి తొక్కిసలాట అంశం వారి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం. ఈ ఘటనపై కేంద్ర హోం శాఖ కూడా పరిశీలిస్తోందని కేంద్ర మంత్రి వీహెచ్‌పీ నేతలకు వివరించారని తెలిసింది.

ప్రజలు ఏమనుకుంటున్నారు..?

రాష్ట్రంలో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలు ఎలాంటి భావంతో ఉన్నారని కేంద్ర మంత్రి అమిత్ షా.. రాష్ట్ర బీజేపీ నేతలను అడిగి తెలుసుకున్నారు. ఆదివారం ఉదయం ఆయన బస చేసిన హోటల్‌లో రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి, కేంద్ర సహాయ మంత్రి భూపతి శ్రీనివాసవర్మ, రాష్ట్ర పార్టీ సంఘటన కార్యదర్శి మధుకర్‌లతో కొద్దిసేపు సమావేశమై రాష్ట్ర రాజకీయాలపై చర్చించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం అందిస్తున్న సహాయ సహకారాలపై పెద్ద ఎత్తున ప్రజలకు వివరించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర నేతలకు సూచించారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలని దిశా నిర్దేశనం చేశారు. నామినేటెడ్ పదవుల పంపకం సహా కూటమి పార్టీల మధ్య సమన్వయం ఎలా ఉందన్న దానిపై కూడా ఈ భేటీలో చర్చ జరిగింది.

2014 నుంచి 2019 వరకు ఏపీలో విధ్వంసం

చంద్రబాబు సమక్షంలోనే అమిత్‌షా సంచలన వ్యాఖ్యలు


natural calamities strike, NDRF comes to the rescue, and when man-made calamities occur, the Narendra Modi government comes to the help. Shri Shah said that in the five years from 2014 to 2019 Andhra Pradesh has faced significant setbacks due to the man-made disaster, affecting the immense potential of the state. He said that to make up for the developmental losses during the period, Prime

ఏపీలో 2014-19 మధ్య మానవ తప్పిదాలతో విధ్వంసం సృష్టించారని అమిత్‌షా చెప్పిన విషయాన్ని ప్రెస్‌నోట్‌లోనూ స్పష్టంగా పేర్కొన్న పీఐబీ

సాక్షి, అమరావతి: 'అపార సహజ వనరులు ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో 2014 నుంచి 2019 వరకు విధ్వంసం సృష్టించారు. అది మానవ తప్పిదాలతో సృష్టించిన విధ్వంసం (మ్యాన్ మేడ్ డిజాస్టర్). దాంతో ఆ ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. అభివృద్ధి పూర్తిగా అడుగంటింది' అని కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. రాష్ట్రంలో 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో అమిత్ షా వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. గన్నవరం మండలం కొండపావులూరులో ఆదివారం నిర్వహించిన ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలోనే ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. అమిత్ షా తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో ఆ ఐదేళ్లలో జరిగిన విధ్వంసానికి మూడు రెట్లు అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. కాగా, అమిత్ షా హిందీ ప్రసంగాన్ని తెలుగులో అనువదించిన బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మాత్రం చంద్రబాబుపట్ల స్వామి భక్తి ప్రదర్శించారు. అమిత్ షా ప్రసంగాన్ని తెలుగులోకి అనువదిస్తూ '2019 నుంచి ఐదేళ్లపాటు రాష్ట్రంలో జరిగిన విధ్వంసం' అని మార్చి చెప్పారు. అమిత్ షా 2014 నుంచి 2019 వరకు అని స్పష్టంగా ప్రసంగిస్తే... పురందేశ్వరి మాత్రం 2019 నుంచి ఐదేళ్లపాటు అని అనువదించారు. కానీ అమిత్ షా ప్రసంగాన్ని అధికారికంగా విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వ సమాచార విభాగం 'ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ) మాత్రం అసలు విషయాన్ని వెల్లడించడం ప్రాధాన్యం సంతరించుకుంది. '2014 నుంచి 2019 వరకు మానవ తప్పిదం సృష్టించిన విధ్వంసంతో ఆంధ్రప్రదేశ్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది' అని అమిత్ షా ప్రసంగించినట్టు ఆ ప్రకటనలో అధికారికంగా పేర్కొంది. మరోవైపు అమిత్ షా నేరుగా హిందీలో చేసిన ప్రసంగం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మోదీ మనసులో ఉన్న మాటనే అమిత్ షా చెప్పారని పలువురు వ్యాఖ్యానించారు. అంటే చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో విధ్వంసం సృష్టించిందని, అది మానవ తప్పిదంతో జరిగిన విధ్వంసమేనని అమిత్ షా చెప్పారని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు.

రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో ప్రతిభ

- 90 పతకాలు సాధించిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు
- 26 బంగారు పతకాలతో సత్తా
- అత్యధికంగా మహబూబ్‌నగర్‌కు 35 పతకాలు



రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ పోటీల్లో రన్నరప్‌గా నిలిచిన వనపర్తి జట్టు(ఫైల్)

మహబూబ్‌నగర్ క్రీడలు: గ్రామీణస్థాయి నుంచి క్రీడలను ప్రోత్సహించడానికి ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్– 2024 క్రీడాపోటీలను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించింది. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో సీఎం కప్ పోటీలను విజయవంతంగా నిర్వహించారు. జిల్లాస్థాయిలో ప్రతిభస్థానంలో నిలిచిన జట్లు రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో పాల్గొన్నాయి. కాగా.. గత నెల 27 నుంచి ఈ నెల 2 వరకు హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో రాష్ట్రస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించగా.. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో రాష్ట్రస్థాయి కబడ్డీ, నెట్‌బాల్ పోటీలను కొనసాగాయి. రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు మెరుగైన ప్రతిభ కనబరిచారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా 90 పతకాలు సాధించడం విశేషం. వీటిలో 26 బంగారు పతకాలు ఉన్నాయి. రాష్ట్రస్థాయి వాలీబాల్, హ్యాండ్‌బాల్, హకీ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లు పాల్గొన్నాయి.

జిల్లాల వారీగా పతకాలు

మహబూబ్‌నగర్ జిల్లా క్రీడాకారులు 35 పతకాలు సాధించారు. వీటిలో 9 బంగారు, 15 రజతం, 11 కాంస్య పతకాలు సాధించారు. ఆర్చరీలో 2 రజతం, అథ్లెటిక్స్‌లో 1 బంగారు, 4 రజతం, 1 కాంస్యం, అత్యపత్యలో 1 రజతం, బాక్సింగ్‌లో 3 బంగారు, సైక్లింగ్‌లో 2 కాంస్యం, జిమ్నాస్టిక్‌లో 1 బంగారు, హ్యాండ్‌బాల్‌లో రజతం, హకీలో రజతం, కిక్‌బాక్సింగ్‌లో 1 రజతం, 1 కాంస్యం, నెట్‌బాల్‌లో 1 బంగారు, 1 రజతం, పారా అథ్లెటిక్స్‌లో 2 బంగారు, 2 కాంస్యం, రోయింగ్‌లో 1 రజతం, 2 కాంస్యం, వాలీబాల్‌లో 2 రజతం, వెయిట్‌లిఫ్టింగ్‌లో బంగారు, ఉషులో 2 కాంస్యం, యోగాలో 1 రజతం, 1 కాంస్య పతకం వచ్చాయి.

➪ వనపర్తి జిల్లా క్రీడాకారులు 19 పతకాలు సాధించారు. 8 బంగారు, 6 రజతం, 5 కాంస్య పతకాలు ఉన్నాయి. అథ్లెటిక్స్‌లో 1 రజతం, 1 కాంస్యం, జూడోలో 1 రజతం, కబడ్డీలో 1 రజతం, కరాటేలో 1 కాంస్యం, కిక్‌బాక్సింగ్‌లో 5 బంగారు, 1 రజతం, 2 కాంస్యం, పారా అథ్లెటిక్స్‌లో 1 బంగారు, 1 రజతం, రోయింగ్‌లో 1 బంగారు, 1 రజతం, షూటింగ్‌లో 1 బంగారు, రెజ్లింగ్‌లో 1 కాంస్యం పతకం ఉన్నాయి.

➪ నారాయణపేట జిల్లా క్రీడాకారులు 14 పతకాలు సాధించగా.. ఇందులో 6 బంగారు, 6 రజతం, 2 కాంస్య పతకాలు ఉన్నాయి. అథ్లెటిక్స్‌లో 1 రజతం, జిమ్నాస్టిక్‌లో 1 రజతం, జూడోలో 2 రజతం, నెట్‌బాల్‌లో 1 కాంస్యం, పారా అథ్లెటిక్స్‌లో 1 బంగారు, రోయింగ్‌లో 1 రజతం, వెయిట్ లిఫ్టింగ్‌లో 1 బంగారు, రెజ్లింగ్‌లో 4 బంగారు, 1 రజత పతకం సాధించారు.

➪ జోగుళాంబ గద్వాల జిల్లా క్రీడాకారులు 9 పతకాలు సాధించగా.. 2 బంగారు, 2 రజత, 5 కాంస్య పతకాలు ఉన్నాయి. అథ్లెటిక్స్‌లో 1 బంగారు, 1 రజతం, 2 కాంస్యం, కోనోయింగ్ కయాకింగ్‌లో 1 కాంస్యం, ఫుట్‌బాల్‌లో 1 కాంస్యం, జూడోలో 1 బంగారు, రెజ్లింగ్‌లో 1 రజతం, 1 కాంస్య పతకాలు గెలుపొందారు.

➪ నాగర్‌కర్నూల్‌లో జిల్లా క్రీడాకారులు 13 పతకాలు రాగా.. వీటిలో 1 బంగారు, 2 రజతం, 10 కాంస్యం పతకాలు ఉన్నాయి. అథ్లెటిక్స్‌లో 2 బంగారు, 3 కాంస్యం, కనోయింగ్ కయాకింగ్‌లో 2 రజతం, కిక్‌బాక్సింగ్‌లో 1 బంగారు, 2 కాంస్యం, పారా అథ్లెటిక్స్‌లో 1 కాంస్యం, ఉషూలో 1 కాంస్యం, యోగా 1 కాంస్య పతకం సాధించారు.

క్రీడాకారులకు వేదిక..



రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో జిల్లాకు 35 పతకాలు రావడం సంతోషంగా ఉంది. సీఎం కప్ పోటీలు క్రీడాకారులకు ఒక వేదికలా ఉపయోగపడింది. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో వేలాది మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లాలో రెండు రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలను విజయవంతంగా నిర్వహించాం.

– శ్రీనివాస్,
డీవైఎస్‌ఓ, మహబూబ్‌నగర్

ఆనందంగా ఉంది..



రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో మా జిల్లా క్రీడాకారులు 19 పతకాలు సాధించడం ఆనందంగా ఉంది. వ్యక్తిగత క్రీడాంశాల్లో ఇంకా మనం ప్రతిభచాటాల్సిన అవసరం ఉంది. సీఎం కప్ క్రీడాపోటీలతో ఔత్సాహిక క్రీడాకారుల నైపుణ్యం బయటికి వచ్చింది. వీరికి ఇంకా మెరుగైన క్రీడా శిక్షణ ఇస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించే అవకాశం ఉంటుంది.

– సుధీర్‌కుమార్‌రెడ్డి,
డీవైఎస్‌ఓ, వనపర్తి

జోగుళాంబ క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



జోగుళాంబ అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్న భక్తులు

- ఆలయంలో అర్చనలు, ప్రత్యేకపూజలు
- అలంపూర్ చౌరస్తాలో బస్సులు లేక ఇబ్బందులు



అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో వస్తున్న భక్తులు

అలంపూర్ : శ్రీజోగుళాంబ అమ్మవారి క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సంక్రాంతి పండుగ సెలవులు ముగియనుండటంతో ఆయా ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులు క్యూలైన్ల ద్వారా శ్రీజోగుళాంబ అమ్మవారిని, బాలబ్రహ్మేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారి ఆలయంలో అర్చనలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో వస్తారని ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ ముందస్తుగా తగు సౌకర్యాలు కల్పించారు. క్యూలైన్‌ల ద్వార వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగుచర్యలు చేపట్టారు. సూదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ ప్రాంగణంలోని నిత్య అన్నదాన సత్రంలో భోజన వసతి కల్పించారు. సూదూర ప్రాంతాల నుంచి అలంపూర్ చౌరస్తా చేరుకున్న భక్తులకు సరైన బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంటల తరబడి నిరీక్షించిన భక్తులు చివరకు ప్రైవేటు వాహనదాల ద్వారా అలంపూర్ క్షేత్రానికి చేరుకున్నారు. పోలీసులు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పర్యవేక్షించారు.

స్థలాన్ని స్టేడియానికి ఇవ్వొద్దు

దళిత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ మాలల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కంచిమి లక్ష్మణ్

మహబూబ్‌నగర్ రూరల్: పట్టణ నడిబొడ్డులో ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల పక్కన ఉన్న ఎస్సీ కళాశాల హాస్టల్ భవనాల స్థలాన్ని జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్స్ (స్టేడియం)కు ఇవ్వరాదని దళిత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆదివారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలు సంఘాల నాయకులు మాట్లాడారు. హాస్టల్ భవనాల స్థలం కావాలని అడిగారంటే విద్యార్థినులను చదువుకు దూరం చేయాలని, దళిత విద్యార్థినుల విజ్ఞానాన్ని ఆదిలోనే అణచివేయాలని కుట్రతో చేశారని ఆరోపించారు. 1972లో ఆస్థలంలో ఎస్సీ హాస్టల్ ఉందని, ఆ తర్వాత మహేంద్రనాథ్ మంత్రిగా ఉన్నప్పుడు మొదటి ఎస్సీ బాలికల గురుకులం జిల్లాలో ప్రారంభించారని గుర్తుచేశారు. ఈ హాస్టల్‌లో 600 మంది విద్యార్థినులు ఉండేవారని, టీఆర్ఎస్ హయాంలో కుట్రతో 10గుంటల భూమిని అప్పటి మంత్రి అండతో లాగేసుకొని స్పోర్ట్స్ వారికి అప్పగించారని తెలిపారు. ఆ తర్వాత హాస్టల్‌ను వేరేచోటకు మార్చడంతో 350మంది విద్యార్థినులు చదువుకు దూరమయ్యారని అన్నారు. 2022 ప్రతిపాదన ప్రకారం అదే స్థలంలో ప్రజా ప్రభుత్వం ఎస్సీ బాలికల కొత్త హాస్టల్ భవనాన్ని నిర్మించాలని, స్పోర్ట్స్ అథారిటీ వారు తీసుకున్న 10గుంటల భూమి తిరిగి హాస్టల్‌కు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దళిత సంఘాలు, విద్యార్థి సంఘాలతో దశల వారీగా ఉద్యమాలు నిర్వహించాలని అభిప్రాయపడ్డారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మాణిక్యంరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.కుర్మయ్య, దళిత సంఘాల నాయకులు సింగిరెడ్డి పరమేశ్వర్, బోయపల్లి నర్సిములు, సామెల్, కంచిమి లక్ష్మణ్, నర్సింహయ్య, బాలరాజు, ప్రవీణ్, పాతూరు రమేష్, గోపాల్, రాము, భరత్, కమలాకర్, ఆది విష్ణువర్దన్, మల్లేష్, మనోహర్, రవి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద బారులుదీరిన వాహనాలు



పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద హైదరాబాద్ వెళ్లే మార్గంలో వాహనాల రద్దీ

తిరుగు ప్రయాణం బారులు

అలంపూర్ చౌరస్తా సమీపంలోని జాతీయ రహదారి-44 పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఆదివారం వాహనాలు బారులుదీరాయి. హైదరాబాద్‌లో వ్యాపారం, ఉద్యోగం, ఉపాధి, విద్యతోపాటు స్థిర నివాసాలు ఉన్న ఆంధ్రప్రదేశ్ వాసులు సంక్రాంతి పండగకు సొంతూళ్లకు తరలివెళ్లారు. సంక్రాంతికి ఇచ్చిన సెలవులు ముగియడంతో వారంతా ఆదివారం తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో వేలాది వాహనాలు జాతీయ రహదారిపై బారులుదీరుతున్నాయి. టోల్ దాటడానికి వాహనాలకు 10 నుంచి 15 నిమిషాల సమయం పట్టింది. బెంగుళూరు- హైదరాబాద్ మార్గంలో వాహనాల రద్దీ కొనసాగగా.. హైదరాబాద్ నుంచి బెంగుళూరు వెళ్లే మార్గంలో మాత్రం రాకపోకలు సాఫీగా సాగాయి. – అలంపూర్